ఈనాడు
శ్రీ సత్యసాయి
శుక్రవారం అక్టోబరు 18, 2024

మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం



పుట్టపర్తి, న్యూస్‌టుడే: నిరుపేదల్లో రక్తహీనత సమస్యలను అధిగమించాలి, పోషకాల లోపాలు నివారించాలి, బడుగుల ఆకలి తీర్చాలి, సంపూర్ణ పోషకాలు అందించాలన్న ఉద్దేశంతో గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం అందజేస్తోంది. కరోనా విపత్తు కాలంలో 2020 ఏప్రిల్ నుంచి ఇది అమలవుతోంది. కుటుంబంలో ఒకరికి అయిదు కిలోల చొప్పున ఇస్తున్నారు. తొలిత రెండేళ్లు అని ప్రకటించినా పొడిగిస్తూ వచ్చింది. మరోసారి 2028 వరకు పథకాన్ని కొనసాగిస్తామని ప్రధానమంత్రి మోదీ ఇటీవల ప్రకటించారు. దీంతో నిరుపేదలకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం అందనున్నాయి. పేదల ఆహార భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా ఇస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో దారిద్రరేఖకు దిగువన ఉన్న 5,57,982 కుటుంబాలకు తెల్లకార్డులు ఇచ్చారు. ఇందులో జాతీయ ఆహార భద్రత చట్టం కింద 5,36,781 కుటుంబాలకు పథకం వర్తిస్తోంది. ప్రతి నెలా జిల్లాకు 8,700 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. మిగిలిన వాటికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. తెదేపా హయాంలో రుపాయికి కిలో బియ్యం పథకం అమలయ్యేది. కేంద్ర ప్రభుత్వం అందజేస్తుండటంతో గత ప్రభుత్వం 2023 జనవరి నుంచి ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసి, ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు లేనివారికి బియ్యాన్ని ఉచితంగా అందజేస్తోంది. ఈ విషయంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ పీఎంజీకేఏవైలో జాతీయ ఆహార భద్రత చట్టం పరిధిలోని కార్డుదారులకు మరో నాలుగేళ్లు ఉచితం బియ్యం పంపిణీకి గడువు పెంచారు. కార్డుదారులందరికీ పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తున్నాం. పోషక విలువలతో కూడిన ఈ బియ్యాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి గ్రామసభలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లాలో భూములు రీసర్వే జరిగిన గ్రామాల్లో శుక్రవారం నుంచి సభలు నిర్వహించాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గ్రామసభల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో 161 గ్రామాల్లో భూముల రీసర్వే జరిగిందని, రెవెన్యూ, సర్వేయర్లు సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈనెల 18 నుంచి నవంబరు 4 వరకు అన్ని రకాల భూ సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరించాలని, రీసర్వే వల్ల నష్టపోయిన రైతులు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు.

వాన తగ్గింది..

➡ కల్లాల్లోనే మొలకలు.. కర్షకులకు కన్నీళ్లు
➡ ఉమ్మడి జిల్లాలో దెబ్బతిన్న పంటలు


నష్టం మిగిల్చింది



బుక్కపట్నంలో మునిగిన వరి పైరు

ఈనాడు, అనంతపురం -న్యూస్‌టుడే, పుట్టపర్తి, కణేకల్లు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి వర్షాలు తగ్గినా.. అన్నదాతలకు మాత్రం నష్టాన్ని మిగిల్చింది. రెండు రోజులుగా కురిసిన వానకు ఉమ్మడి అనంత జిల్లాలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. కోతలు పూర్తిచేసి పొలాల్లో ఉంచిన వేరుసెనగ, కల్లాల్లోని మొక్కజొన్న మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరుసెనగ కాయలు బూజుపట్టాయి. మరోవైపు ఎక్కడా పంటలు దెబ్బతినలేదని వ్యవసాయ అధికారులు చెబుతుండటం గమనార్హం. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, పెనుకొండ, పరిగి, మడకశిర, రొళ్ల మండలాల్లో మాత్రమే 109 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు నివేదిక రూపొందించారు. అనంతపురం జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే నష్టం లేదని తేల్చేశారు. బొమ్మనహాళ్, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. మిరప పూత రాలడంతో రైతులు నష్టపోయారు.

రూ.2.40 లక్షలు నష్టపోయా..



-రామచంద్ర, రాగానిపల్లి, నల్లమాడ మండలం

నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఐదు రోజుల కిందట పంట తొలగించి కల్లంలో ఆరబెట్టాం. వర్షానికి పంట తడిసిపోయింది. మొలకలు వచ్చి పంట దెబ్బతింది. నెల కిందట క్వింటాలు రూ.2,900 ఉండగా.. ఇప్పుడు వర్షాల కారణంగా రూ.650 తగ్గించారు. నాలుగు ఎకరాల్లో 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అమ్మితే రూ.2.40 లక్షలు వచ్చేది. మొలకెత్తడంతో రూపాయి కూడా వచ్చే అవకాశం లేదు.

80 క్వింటాళ్లు వర్షార్పణం



రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వర్షాలకు కల్లంలోని పంట మొలకెత్తింది. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.1.60 లక్షలు వచ్చేది. ఇప్పుడు ఈ మొత్తం నష్టపోయినట్టే. పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. **- శివశంకర్, యర్రగుంట, కణేకల్లు మండలం**

మొలకెత్తిన మొక్కజొన్న

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో పలుచోట్ల మొక్కజొన్న కల్లాల్లోనే మొలకెత్తింది. ఉమ్మడి జిల్లాలో 55 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కణేకల్లు, బొమ్మనహాళ్, పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో ఆరబోసిన మొక్కజొన్న మొలకెత్తడంతో రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా 1500 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనా. నిబంధనల పేరుతో అధికారులు పంటనష్టం వివరాలు నమోదు చేసుకోవడం లేదని వాపోతున్నారు. దీంతోపాటు వర్షానికి మిరపలో పూత రాలిపోయింది. ఫలితంగా దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టామని.. పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.



పొంగిపొర్లుతున్న సాహెబ్‌చెరువు



పుట్టపర్తి ప్రధాన వీధిలో వర్షపు నీరు



చిత్రావతి నది చెక్‌డ్యామ్ వద్ద ప్రవాహం

పొంగిపొర్లిన వాగులు.. వంకలు

పుట్టపర్తి, పుట్టపర్తి పట్టణం, పుట్టపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసింది. బుధవారం రాత్రి మొదలై గురువారం ఉదయం 8 గంటల వరకు కుండపోత వాన పడింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరుతుంటంతో పొంగిపొర్లుతున్నాయి. చిత్రావతి, వంగపేరు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్నిచోట్ల పాత ఇళ్లు ధ్వంసమయ్యాయి.

పుట్టపర్తిలో అత్యధికంగా 122.8 మి.మీ వర్షపాతం

పుట్టపర్తి మండలంలో 122.8 మి.మీ. వర్షం కురిసింది. కొత్తచెరువు 110.6, బుక్కపట్నం 99.6, పెనుకొండ 90.2 రామగిరి 77.2, సీకేపల్లి 73.8, ముదిగుబ్బ 71.8, రొద్దం 68.6, నల్లమాడ 67.0, గోరంట్ల 66.8, సోమందేపల్లి 63.6, ధర్మవరం 63.4, ఓడీసీ 59.0, నల్లచెరువు 54.2, అమరాపురం 50.2, గాండ్లపెంట 44.6, కదిరి 44.6, అమడగూరు 42.8, తలుపుల 41.6, గుడిబండ 41.4, ఎన్‌పీకుంట 41.0, తనకల్లు 40.4, కనగానపల్లి 39.0, మడకశిర 38.4, రొళ్ల 36.6, పరిగి 34.0, తాడిమర్రి 32.4, బత్తలపల్లి 31.8, చిలమత్తూరు 30.2, హిందూపురం 27.8, ఆగళి 26.6, లేపాక్షి 23.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా ప్రణాళికాధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

ఖాద్రీశుడి ఆలయంలోకి వరద



తూర్పు గోపుర ద్వారం గుండా ఆలయంలోకి వస్తున్న వర్షపునీరు



జలమయమైన ఆలయ ముందు భాగం

కదిరి, న్యూస్‌టుడే : కదిరిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వదర నీరు ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రవహించింది. భక్తులు స్వామివారిని రాత్రి 8గంటల వరకు దర్శనం చేసుకుంటూ ఉంటారు. సాయంత్రం 5.50 నుంచే వర్షం కురవడం మొదలైంది. దీంతో వరద తూర్పు ద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించింది. అప్పటికే ఆలయంలోనే ఉన్న భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయ ముందుభాగంలోని కాలువలు స్తంభించిపోవడం, సక్రమంగా లేకపోవడంతో ప్రవేశద్వారం నుంచి పడమటి గోపురం మార్గం గుండా బయటకు వెళ్లాయి. వరద ఆగేవరకు భక్తులు అగచాట్లు పడ్డారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడండి

పుట్టపర్తి: జిల్లాలో ఎక్కడా తాగునీటి పైపులు లీకేజీ జరగకుండా చూడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణనష్టం, నివేదికలు సిద్ధం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించడం, పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేయించాలని, అవసరమైన గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో ధర్మవరం, అమరాపురం, ఆముదాలకుంట, పెనుకొండ, చెరువుల నీటి సామర్థ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీవోలు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి సవిత, వేదికపై ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ, వెంకటప్రసాద్, సునీత, జయరాం, సురేంద్రబాబు, శ్రావణిశ్రీ, అనంత, శ్రీసత్యసాయి జిల్లాల తెదేపా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, అంజనప్ప తదితరులు

19, 20 తేదీల్లో మంత్రి సత్యకుమార్ పర్యటన

ధర్మవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈనెల 19, 20 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 19న బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలో నిర్వహించే పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం అనంతపురంలో జరిగే జిల్లా పరిషత్తు సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 4 గంటలకు ధర్మవరంలో చేనేత ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. 20న ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం మండలాల్లో జరిగే పల్లె పండగ వారోత్సవాల్లో పాల్గొంటారు.

ఉత్తమ పాలనకు వాల్మీకి రచనలు స్ఫూర్తి

ఘనంగా మహర్షి రాష్ట్రస్థాయి జయంత్యుత్సవం

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలి, మంచి పాలన ఎలా సాగించాలో మహర్షి వాల్మీకి రచనలు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతపురంలో గురువారం వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాన్ని కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ముందుగా పాతూరు పవర్ ఆఫీసు వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. అనంతరం గుత్తి రోడ్డులోని బళ్లా కన్వెన్షన్ హాల్లో సభ నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీలు, ఎమ్మెల్యేలు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాల్మీకి, కురుబలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చిన ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకులు దశాబ్దాలుగా వెనుకబాటుకు గురయ్యారని, గత వైకాపా ప్రభుత్వం మరింత వెనుకబడే విధంగా చేసిందని విమర్శించారు. టవర్‌క్లాక్ వద్ద ఉన్న బ్రిడ్జికి వాల్మీకి వారధిగా నామకరణం చేయాలని కోరారు. హిందూపురం ఎంపీ బి.కె.పార్థసారథి మాట్లాడుతూ వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి పార్లమెంటులో ఒత్తిడి తీసుకొచ్చి సాధిస్తామన్నారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా.. వాల్మీకులకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఎంపీలు చొరవ చూపాలన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వాల్మీకి సమాజానికి మార్గదర్శి అని కొనియాడారు. కళ్యాణదుర్గం, గుంతకల్లు, శింగనమల, మడకశిర ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, ఎం.ఎస్.రాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి పోలా భాస్కర్, కలెక్టరు వినోద్‌కుమార్ ప్రసంగించారు. బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఖుష్బు కొఠారి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, జనసేన నాయకులు ఈశ్వర్, జడ్పీ మాజీ ఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన సంఘం నాయకులు, ప్రజలు

ఉమ్మడి అనంతకు రూ.24.63 కోట్లు

◆ నిధులు మంజూరు చేసిన ఈసీ ◆ బిల్లుల చెల్లింపుపై ఉద్యోగుల్లో ఆశలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన అధికారులు, ఉద్యోగులు పెండింగ్ బిల్లుల సొమ్ము వచ్చేసింది. ఇక నిర్దేశిత సిబ్బందికి చెల్లింపులు చేయాల్సి ఉంది. వారికే కాకుండా గుత్తేదారులకు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. గతంలో ఎన్నికల జరిగిన రెండుమూడేళ్ల తర్వాత పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేవి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి పెండింగ్ బిల్లులు పెట్టిన నాలుగు మాసాలకే ఎన్నికల సంఘం (ఈసీ) నిధులు మంజూరు చేయడం గమనార్హం. రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వివేక్‌యాదవ్ సిఫార్సు చేసిన వెంటనే తెదేపా కూటమి ప్రభుత్వం రూ.299.37 కోట్లు మంజూరు చేసింది. ఇందులో అనంత జిల్లాకు రూ.17.27 కోట్లు శ్రీసత్యసాయి జిల్లాకు రూ.7.36 కోట్లు కేటాయించారు. సత్వరమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంత చెల్లిస్తారు.. పెండింగ్ బిల్లు మొత్తం ఇస్తారా.. లేదా? అన్న సందేహాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

> అనంత జిల్లాలో 2,236 మంది బూత్ స్థాయి అధికారులు(బీఎల్ఓ) పని చేస్తున్నారు. వారిలో దాదాపు గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులే. 2020 నుంచి ఇప్పటి దాకా ఒకొక్కరికి రూ.29,500 ప్రోత్సాహకం/బిల్లు రావాలి. ప్రస్తుతం ఎంత ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు.

మూడు మాసాల శ్రమ

రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు ఏకకాలంలో జరిగిన సంగతి తెలిసిందే. మే 13న పోలింగ్‌క్స్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగాయి. మార్చి, ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారం దాకా వేలాది మంది అధికారులు, ఉద్యోగులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్నారు. ఇందుకు కేడర్ల వారీగా తగిన ప్రోత్సాహకం, గౌరవవేతనం చెల్లించాల్సి ఉంది. పోలింగ్, ఓట్ల లెక్కింపు రోజుల్లో పని చేసిన సిబ్బందికి అక్కడికక్కడే నిర్దేశిత సొమ్ము చెల్లించారు. బీఎల్ఓ, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఆర్ఓ కార్యాలయాలు, జిల్లా ఎన్నికల కార్యాలయం, ఇలా అనేక చోట్లా పని చేసిన సిబ్బందికి అరకొర బిల్లు ఇచ్చారు. ఇప్పటికీ చాలా మందికి రూ.వేలల్లోనే బిల్లు చెల్లించాల్సి ఉంది. తాజాగా పెండింగ్ నిధులు రావడంతో ఉద్యోగుల్లో ఆశలు రేగాయి.

'లెక్క'లేని వ్యయం

ఎన్నికల వ్యయం కోసం ఇప్పటికే కొంత నిధులు మంజూరు అయ్యాయి. ఒక్క అనంత జిల్లాకే దాదాపు రూ.14కోట్లుపైగా వచ్చినట్లు తెలుస్తోంది. దీన్ని ఇప్పటికే ఖర్చు పెట్టారు. ఈ క్రమంలో అనంత, రాప్తాడు, శింగనమల, తాడిపత్రి.. తదితర ప్రాంతాల్లో ఎన్నికల ఖర్చులో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వచ్చాయి. మంజూరైన నిధులు, ఖర్చుకు పొంతన లేదన్న వాదన తెరపైకి వచ్చింది. ఫర్నీచర్, భోజనాలు, తాగునీరు, బ్యాలెట్ సామగ్రి ముద్రణ, బారికేడ్ల నిర్మాణం, వాహనాల అద్దె... ఇలా అనేక రూపాల్లో అద్దె చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ.20కోట్లు దాకా అదనంగా నిధులు కావాలంటూ ఇది వరకే సీఈఓకు నివేదించారు. ఈనేపథ్యంలో అనంత జిల్లాకే రూ.17.27 కోట్లు నిధులు వచ్చాయి. డబ్బు రావడంతో గుత్తేదారులు, ఉద్యోగులు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.


మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి దీక్ష



డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకుల ఆందోళన

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొత్తచెరువులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం దగ్గర సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్‌లు గురువారం సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలైనా నేటికీ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు వర్తించడం లేదన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారు. నేటికీ పదోన్నతులు, బదిలీలు జరగలేదన్నారు. వెంటనే బదిలీలు చేపట్టి ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని డీఈవో మీనాక్షికి అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భూతన్న, నరేష్ కుమార్, లక్ష్మీనారాయణ, బాబు, పెద్దన్న, నారాయణ స్వామి, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి ప్రగతికి జానకీరామయ్య ఎనలేని కృషి



నివాళులర్పిస్తున్న ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్ దంపతులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సత్యసాయి సోదరుడు, ట్రస్టు మాజీ సభ్యుడు దివంగత జానకీరామయడు ఎనలేని కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గణేష్ కూడలిలో ఆర్‌వీ జానకీరామయ్య 21వ వర్ధంతిని పురస్కరించుకొని ఘాట్‌ను వివిధ రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆయన కుమారుడు, సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సతీమణి హిమవాహిని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యసాయి ట్రస్టు సభ్యుడిగా, సమితి అధ్యక్షుడిగా, సర్పించిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణంలోని 150 మంది కార్మికులకు నిత్యావసర వస్తువులు, వస్త్రాలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అన్నదానం చేశారు.







నేత్రపర్వంగా చింతలరాయుడి రథోత్సవం



స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు



భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని చింతల వెంకటరమణస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణం, రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం చింతలరాయుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య సంప్రదాయంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పురవీధుల్లో మహారథోత్సవాన్ని నిర్వహించారు. వేడుకల్లో నరసింహుడు, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయుడి వేషధారులు పలువురిని ఆకట్టుకున్నాయి. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

ముందు జాగ్రత్తలే శ్రీరామరక్ష

- వర్షంతో పంటలకు చీడపీడలు ఆశించే అవకాశం
- సకాలంలో మందులు పిచికారీ చేయాలని శాస్త్రవేత్తల సూచన



ఆముదం పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు చంద్రాయుడు, మల్లికార్జున తదితరులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రస్తుతం తుపాను ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు తెలిపారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లోని పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. ఆముదం, కంది, టమాట, అరటి పంటలను పరిశీలించారు. తుపాను కారణంగా పంటలకు ఆశించే చీడలు, తెగుళ్ల వాటి నివారణ చర్యల గురించి శాస్త్రవేత్త వివరించారు.

● ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఆముదం పంటను 22,340 హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం పంట రెండు, మూడో గెల దశలో ఉంది. జడివాన కురుస్తున్న వర్షాలకు బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు హెక్సాకొనజోల్ 2మి.లీ లీటరు నీటికి లేదా కార్బెండజిమ్ 2గ్రాములు లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి.

● కంది పంటను రైతులు 1.40 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉంది. వర్షాలకు మొగ్గతొలుచు పురుగు, కాయతొలుచు పురుగు, వెర్రి తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు స్పైరోటెట్రామెట్ 400మి.లీ. 200 లీటర్ల నీటికి లేదా బెరాజైడ్ 400మి.లీ. 200 లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలి. పంట ఆశాజనకంగా ఉండటంతో ఎకరాకు 4క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

● టమోట పంట పూత దశలో ఉంది. ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున హెక్సాకొనజోల్ 2మి.లీలు లీటరు నీటికి కలిపి లేదా సాఫ్ 2.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● అరటి 20వేల హెక్టార్లలో సాగు చేశారు. పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. నివారణకు రైతులు ప్రొపికొనజోల్ 1మి.లీ, మినరల్ ఆయిల్ 10మి.లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

● దానిమ్మ 10వేల హెక్టార్లలో సాగయింది. పంటలో బ్యాక్టీరియల్ ఆకుమచ్చ తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.1గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్త సూచించారు.

బ్యాంకు నిరర్థక ఆస్తుల తగ్గింపుపై దృష్టి పెట్టాలి

తపోవనం(అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిరర్థక ఆస్తుల శాతాన్ని గణనీయంగా తగ్గించాలని సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. ప్రతి మేనేజరు ఎన్‌పీఏ శాతాన్ని పూర్తిగా తగ్గించడంపైనే ప్రధాన దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అన్ని శాఖల మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బ్యాంకు అన్ని విధాలా అభివృద్ధి సాధించాలంటే పాత బకాయిల వసూలుపై చర్యలు తీసుకోవాలన్నారు. వాయిదా మీరిన రుణాలు రాబట్టడానికి న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించాలని సూచించారు. అదేవిధంగా స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా మంజూరు చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కొత్తగా ప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లక్ష్యాలను అధిగమించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి కావాలంటే ఆయా శాఖల మేనేజర్లు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. బకాయిలు చెల్లించే స్థోమత ఉన్న వారిపై దృష్టి పెట్టి న్యాయపరమైన తాఖీదులు జారీ చేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ సురేఖరాణి, జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, నాబార్డు డీడీఎం అనురాధ, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, ఓఎస్‌డీ సూర్యనారాయణ, డీజీఎంలు విజయచంద్రారెడ్డి, రాంప్రసాద్, సుఖదేవబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శాఖల వారీగా వివిధ అంశాలపై సంయుక్త కలెక్టర్ సమీక్షించారు.



మాట్లాడుతున్న జేసీ శివనారాయణ శర్మ, అధికారులు

హంద్రీనీవా ఎస్‌ఈగా సీఈ నాగరాజు

నలుగురు డీఈలకు ఈఈలుగా బాధ్యతలు

అనంతపురం(శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: జిల్లా జలవనరుల శాఖలో పలు కీలక పోస్టుల్లోకి ఇన్‌ఛార్జి అధికారులను నియమించారు. గురువారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు. జిల్లా జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరు(సీఈ) కె.నాగరాజుకే హంద్రీనీవా ఎస్ఈ పర్యవేక్షక ఇంజినీరుగా(ఎస్ఈ) నియమించారు. ప్రస్తుత సీఈ పోస్టులో ఇన్‌ఛార్జిగానే ఉన్నారు. ఈయన వాస్తవ పోస్టు విజయవాడలో ప్రాధాన్యత ప్రాజెక్టుల పర్యవేక్షక విభాగం ఎస్ఈగా ఉన్నారు. అక్కడి నుంచి రెండు మాసాల క్రితం ఇన్‌ఛార్జి సీఈగా బాధ్యతలు తీసుకున్నారు. మొన్నటి దాకా హంద్రీనీవా ఎస్ఈగా పని చేసిన దేసేనాయక్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈయన్ను కూడా ప్రస్తుతం నెల్లూరు జలవనరుల శాఖ ఎస్ఈగా నియమించారు. ఇదిలా ఉండగా... జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ డీఈలు, ఇతర జిల్లాకు చెందిన ఒక డీఈకి ఈఈలుగా బాధ్యతలు అప్పగించారు. అనంత హంద్రీనీవా డివిజన్-7 ఈఈ బాధ్యతలను డీఈ గుర్రం శ్రీనివాసులను, నందికొట్కూరు డివిజన్‌లో పని చేస్తున్న డీఈ సాకే రాధాకృష్ణ పెనుకొండ ఐబీ డివిజన్ ఈఈగా నియమితులయ్యారు. హంద్రీనీవా మదనపల్లి సర్కిల్ పరిధిలోని కదిరి డివిజన్-11 ఈఈగా పెనుకొండ ఐబీ డివిజన్ డీఈ గంగాధర్, అనంత డివిజన్-7 డీఈగా ఉన్న రాజన్‌బాబును నందికొట్కూరు డివిజన్ ఈఈగా నియమించారు. వీరందరూ ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

చెక్ బౌన్స్ కేసులో ఏఎన్ఎంకు 6నెలల జైలుశిక్ష.. రూ.6 లక్షల జరిమానా

గోరంట్ల, పెనుకొండ, న్యూస్‌టుడే: గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వెంకటనారాయణమ్మకు ప్రభుత్వ ఎఎన్ఎం భారతి డబ్బు ఇవ్వాల్సి ఉండగా చెక్ ఇచ్చింది. అది బౌన్స్ కావడంతో కేసు నమోదైంది. దీంతో బాధితురాలు కోర్టుకు వెళ్లడంతో విచారణ చేసిన పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి మసాలా బొజ్జప్ప భారతికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాబ్‌జాన్ తెలిపారు. జరిమానా చెల్లించలేని పక్షంలో అదనంగా ఒకటిన్నర నెల జైలుశిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇదే కేసుకు సంబంధించి కోర్టు నెల క్రితం అరెస్టు వారెంట్ జారీ చేయడంతో వెళ్లిన పోలీసులపై దాడి చేయగా రొద్దం పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ప్రస్తుతం ఆమె రిమాండ్‌లో ఉన్నట్లు కానిస్టేబుల్ వివరించారు.

పోలీసుల అదుపులో మరో నిందితుడు?

హిందూపురం, న్యూస్‌టుడే: చిలమత్తూరు మండలం నల్లబొమ్మపల్లిలో అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారం కేసులో నిందితుడై పరారిలో ఉన్న చాకలి శ్రీనివాసులును ప్రత్యేక పోలీసులు గురువారం రాత్రి మడకశిర ప్రాంతంలో అదుపులోకి తీసుకొన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ ఘటనలో ఆరుగురు నిందితులు పాల్పడగా ఇప్పటికే పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఇతను పరారిలో ఉండటంతో ఇతని ఆచూకీ కోసం ప్రత్యేక పోలీసులు గాలింపు చేపట్టారు. ఇతడిది లేపాక్షి మండలం కల్లూరు గ్రామమైనా ప్రస్తుతం హిందూపురం పట్టణం త్యాగరాజనగర్‌లో నివాసం ఉంటున్నాడు.

పిడుగుపాటుకు రైతు మృతి



జయరాం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన రైతు జయరాం (49) పిడుగుపాటుకు మృతిచెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు మేరకు వివరాలు. గురువారం సాయంత్రం మెరుపులు, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. మేతకు వెళ్లిన గేదెలను ఇంటికి తోలుకొచ్చేందుకు జయరాం గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి గేదెలతో పాటు ఇంటికి వచ్చే సమయంలో పిడుగుపాటుకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన జయరాంను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందారు. రైతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న సంయుక్త సంచాలకులు డాక్టర్ మాధవరావు, పక్కన జేడీఏ డాక్టర్ వెంకటస్వామి తదితరులు

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లా పశుసంవర్ధకశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆశాఖ సంయుక్త సంచాలకులు మాధవరావు(డైరెక్టరేట్) ఆదేశించారు. గురువారం అనంతపురం డివిజన్ కార్యాలయంలో జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షకు జేడీఏహెచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాకు 1500 మినీ గోకులాలు(పశువుల షెడ్లు) మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం కింద షెడ్ల నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు పంట రుణాల మాదిరిగానే పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించామని, జిల్లాకు 11 వేల కార్డులు మంజూరు చేశామన్నారు. ఎవరు జామినీ లేకుండా బ్యాంకుల ద్వారా రూ.1.60 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. అన్ని బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేలా చూడాలని లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింగరావును కోరారు. ఈ నెలాఖరులోపు అన్ని గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించే ప్రక్రియ పూర్తి చేసేలా చూడాలని పశువైద్యులను ఆదేశించారు. ఉచిత పెయ్యిదూడల పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీంబాషా, ఎల్డీఎం నరసింగరావు, పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ సుధాకర్, డీడీఏహెచ్‌లు రమేశ్‌రెడ్డి, వెంకటేశ్, ఏడీఏహెచ్‌లు, పశువైద్యులు పాల్గొన్నారు.

టపాసుల అక్రమ రవాణా

హిందూపురంలో రూ. 20 లక్షల సరకు పట్టివేత

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: ఈ-వేబిల్లు, ఇన్‌వాయిస్ లేకుండా టపాసులు తరలిస్తున్న లారీలను నిఘా విభాగం, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గురువారం పట్టుకున్నారు. అనంతపురం నగరంలో నిఘా విభాగం అధికారులు తనిఖీలు చేస్తుండగా టపాసులను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టుబడింది. విచారణ నిమిత్తం లారీని వాణిజ్య పన్నులశాఖ అధికారులకు అప్పగించారు. ఇన్‌వాయిస్‌లో ఒక తేదీ, ఈ-వేబిల్లులో ఒక తేదీ ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. హిందూపురంలోనూ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు టపాసులను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. శివకాశి నుంచి బీదర్‌కు ఈ-వేబిల్లు లేకుండా టపాసులు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.20లక్షలు ఉంటుందని వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి చెప్పారు.

కేంద్ర మంత్రి మురుగన్ రాక నేడు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి మహాసమాధి దర్శనార్థం కేంద్ర సమాచార, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ శుక్రవారం పుట్టపర్తి రానున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. శాంతిభవన్ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 4.30 గంటలకు బెంగళూరుకు వెళతారు. మంత్రి రాకను పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి



నారాయణప్ప

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మాగేచెరువుకు చెందిన పెద్దింటి నారాయణప్ప(65) గురువారం అడవి తేనెటీగల దాడిలో మృతి చెందారు. గ్రామస్థులు, బంధువుల కథనం మేరకు వివరాలిలా.. నారాయణప్ప రోజులాగే గురువారం పాడి పశువులను మేపడానికి చాకార్లపల్లి జగనన్న కాలనీ సమీపానికి వెళ్లారు. సాయంత్రం అడవి తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. విలవిలలాడుతూ ఇంటికి వస్తున్న విషయాన్ని గుర్తించిన సోదరుడి కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే ఆయన్ను కారులో హిందూపురం ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాణాలు వదిలారు.

పచ్చని సంసారంలో ఒక్కొక్కరు మృత్యువాత

నాలుగేళ్ల కిందటి వరకు ఎంతో సుఖ సంతోషాలతో సాఫీగా జీవనం సాగించిన కుటుంబం అది. విధికి కన్ను కుట్టిందేమో. పచ్చని సంసారంలో ఒక్కొక్కరే మృత్యువాత పడ్డారు. కుమారుడు అశోక్‌కుమార్ నాలుగేళ్ల కిందట కరోనా మహమ్మారి బారిన పడటంతో మృతి చెందగా..అతని బెంగతో తల్లి అంజనమ్మ ఆరు నెలల కిందట అనారోగ్యానికి గురై చనిపోయారు. ప్రస్తుతం కోడలు, మనవడు ఉన్న ఆ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న నారాయణప్ప మృతి చెందడాన్ని సోదరుడి కుటుంబం, బంధువులు, మిత్రులు, పలువురు గ్రామస్థులు జీర్ణించుకోలేక..ఆ కుటుంబ పరిస్థితిని గుర్తుచేసుకొని కంటతడి పెట్టారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

కన్నోళ్ల ఆశలు ఆవిరి

ఆ ఇద్దరు మంచి స్నేహితులు. చిన్నతనం నుంచి కలిసి మెలిసి తిరిగారు. ఎక్కడికి పోవాలన్నా జతగా వెళ్లడం అలవాటు. ఆ మిత్రుల అన్యోన్య బంధాన్ని చూసి ఎవరికి ఈర్ష కలిగిందో ఏమో. రోడ్డు ప్రమాద రూపంలో వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. చివరకు వల్లకాడికి సైతం కలిసే వెళ్లారు. కన్నోళ్ల ఆశలన్నీ ఆవిరి చేశారు. ఈ హృదయ విదారక ఘటన శింగనమల మండలం ఆకులేడు గ్రామాన్ని శోకసంద్రంలో ముంచింది.

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- ఆకులేడులో విషాదం



సుబ్బరాయుడు జయసింహా

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు(21), జయసింహా(22) మంచి స్నేహితులు. ఈ నెల 13న అర్ధరాత్రి పని నిమిత్తం ఆకులేడు నుంచి అనంతపురం నగరానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మండల పరిధిలోని గుత్తిరోడ్డు ఏటీఎం వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దర్నీ బంధువులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. గురువారం తెల్లవారు జామున సుబ్బరాయుడు, మధ్యాహ్నం జయసింహా చికిత్సపొందుతూ మృతి చెందారు. సుబ్బరాయుడు వారి తల్లిదండ్రులకు ముగ్గురు కుమార్తెల తర్వాత కలిగిన ఒక్కగానొక్క కుమారుడు. జయసింహా తల్లిదండ్రులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా జయసింహా రెండో కుమారుడు అని బంధువులు తెలిపారు. చేతికొచ్చిన పిల్లలు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో వారి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. ఈఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


ఓపెన్ స్కూలు ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఏపీ ఓపెన్‌స్కూల్ ద్వారా పదోతరగతి, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు పరీక్షల విభాగం సంచాలకులు గోవిందనాయక్ తెలిపారు. ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 26 నుంచి 29వ తేదీలోపు, రూ.500 అపరాధ రుసుంతో 31వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సార్వత్రిక విద్యాపీఠం ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జేఎన్‌టీయూలో తక్షణ ప్రవేశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ అనుబంధ ఓటీపీఆర్ఐలో ఎంఎస్సీ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు తెలిపారు. ఏపీపీజీఈటీ-2024లో అర్హత సాధించి, డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఈ నెల 21న జేఎన్‌టీయూలోని ప్రవేశాల విభాగంలో హాజరు కావాలని ఆయన కోరారు.

టమాటా కిలో రూ.60



రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌కు టమాటా విక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. సరకు తగ్గడంతో ధరలు కిలో గరిష్ఠం రూ.60, మధ్యస్థం రూ.45, కనిష్ఠం రూ.35 చొప్పున పలికాయి. మార్కెట్‌కు 15 కిలోల పెట్టెలు వచ్చాయి. ఒక్కో పెట్టె గరిష్ఠం రూ.900, మధ్యస్థం రూ.675, కనిష్ఠం రూ.525 చొప్పున ధరలు పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

14,981 క్వింటాళ్ల పప్పుసెనగ విత్తనం పంపిణీ

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో గత మూడ్రోజులుగా రాయితీ పప్పుసెనగ విత్తన పంపిణీ కొనసాగుతోంది. ఇప్పటి వరకు మొత్తం 19,289 క్వింటాళ్లు విత్తనం కావాలని 13,561 మంది రైతులు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 14,981 క్వింటాళ్ల విత్తనాలను 9,689 మంది రైతులకు పంపిణీ చేశామని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.

వేటకొడవలితో ఇద్దరిపై దాడి

నిందితుడిపై పోక్సో, హత్యాయత్నం కేసు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో గౌస్‌పీరా అనే వ్యక్తి వేటకొడవలి దాడి చేయడంతో ఇద్దరు గాయపడ్డారని ఎస్సై గౌస్ బాషా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రాము, గౌస్‌పీరా ఓ విషయంలో ఇద్దరూ వాదులాడుతున్నారు. ఈక్రమంలో తెదేపా నాయకుడు రాజు, బ్రహ్మయ్య వారికి సర్దిచెప్పి ఇంటికి బయలుదేరుతుండగా గౌస్‌పీరా వేటకొడవలితో దాడి చేయగా ఇద్దరూ గాయపడ్డారు. గౌస్‌పీరా ఓ బాలికను తరచూ వేధిస్తుండగా ఆమె గతంలో ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ విషయంలోనే గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో గౌస్‌పీరాపై పోక్సో, హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై గురువారం ఆటోను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రత్నమ్మ, శారద, వాసుదేవప్ప, రంగప్పతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు మడకశిర ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతిచెందిన ఘటన కూడేరు మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని కమ్మూరుకు చెందిన చిన్న ఓబులేశ్ (79) అనే వృద్ధుడు గురువారం వర్షానికి ఇల్లు కారుతోందని మిద్దె ఎక్కి చౌడు వేస్తున్నాడు. సర్వీసు వైరు (విద్యుత్తు తీగ) నుంచి సరఫరా రావడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు నరసింహులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం



మధుసూదన్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో మధుసూదన్(34) అనే రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారని గురువారం ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు. ఒకటో పట్టణ సీఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు ప్రొద్దుటూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన మధుసూదన్ గుంతకల్లులోని రైల్వే సీనియర్ డీసీఎం కార్యాలయంలో సీనియర్ క్లర్క్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట కార్యాలయ సూపరింటెండెంట్‌గా పదోన్నతి వచ్చింది. ఇతను చర్చి స్కూల్ రోడ్డులో బ్యాడ్మింటన్ కోర్టు ఎదురుగా ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వీరికి 11 ఏళ్ల మనుశ్రీ కుమార్తె ఉంది. రెండేళ్ల కిందట బళ్లారికి చెందిన హేమవతిని రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె సాఫ్ట్‌వేరు ఇంజినీరుగా పని చేస్తున్నారు. దసరా పండగకు ప్రొద్దుటూరుకు వెళ్లాదామని భర్త పిలిచినా ఆమె రాకపోవడంతో అతను ఒక్కడే ఊరు వెళ్లి వచ్చాడు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఒకరినొకరు మాట్లాడుకోవటం లేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి పడక గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య, స్థానికులు సహకారంతో తలుపును బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అతను ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని పోలీసులు వివరించారు. మృతుడికి ఏరియా ఆసుపత్రిలో శవపరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

సనాతన ధర్మవ్యాప్తికి రాయలు కృషి



రాయల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న గోరంట్ల వాసులు

గోరంట్ల: సనాతన ధర్మవ్యాప్తి కోసం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు విశేషంగా కృషి చేశారని చరిత్రకారుడు మైనాస్వామి పేర్కొన్నారు. స్థానిక మాధవరాయల ఆలయంలో రాయల వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా రాయల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో స్థానికులు ఈశ్వరరెడ్డి, రామప్ప, సూరి, నాగభూషణ, పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువు వద్దకు వెళ్లొద్దని సూచన



అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, సిబ్బంది రామకృష్ణ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సోమందేపల్లి చెరువు నిండి మరువ పారుతోందని, ఎవరూ ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లరాదని హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్ సూచించారు. గురువారం సిబ్బంది రామకృష్ణతో కలిసి ఆయన చెరువును పరిశీలించారు. రైతులు, యువకులు, పిల్లలతో మరువ పారుతున్న చోట చేపలు పట్టేందుకు పోటీ పడుతూ ప్రమాదకరంగా కనిపించారు. విషయాన్ని సీఐ రాఘవన్, ఎస్సై రమేశ్ బాబు దృష్టికి తీసికెళ్లి, వారి ఆదేశాలతో అక్కడున్న వారందరికీ అవగాహన కల్పించారు.

నేటి నుంచి గ్రామసభలు

పరిగి: జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు పరిగి మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం 18వ తేదీ(శుక్రవారం) నుంచి 24వ తేదీ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా, ఆర్ఐ సిద్దేశ్వర్‌లు తెలిపారు. 18న బందారపల్లి, 19న విట్టాపల్లి, 21న సంగమేశ్వరంపల్లి, 22న యర్రగుంట, 23న కొడిగెనహళ్లి, 24న శాసనకోట, 25న గణపతిపల్లి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని వివరించారు.

మరవ వద్ద కంపచెట్ల తొలగింపు

పరిగి: పరిగి చెరువు మరవ కట్టలో పేరుకుపోయిన ముళ్ల కంపను గురువారం తెదేపా సీనియర్ నాయకుడు లక్ష్మణరావు, తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో రెండు పొక్లెయిన్లతో తొలగింపజేశారు. పలకల మరవ వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి వేసేందుకు కంకర, ఇసుక తరలించామని, శుక్రవారం గుంతలను పూడ్చివేసి మరమ్మతులు పూర్తి చేస్తామని నాయకులు లక్ష్మణరావు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మడకశిర గ్రామీణం: వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన ఏపీసీఎన్ఎఫ్(ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్)యూనిట్ ఇన్‌ఛార్జి రంగనాథ్ కుటుంబానికి గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రూ.60వేల ఆర్థిక సాయం అందజేసినట్లు మడకశిర డివిజన్ ఇన్‌ఛార్జి పి.రమేశ్ తెలిపారు.

ఎంపీడీవోలు బాధ్యతల స్వీకరణ

సోమందేపల్లి: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవోగా మమతాదేవి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఆమె కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సోమందేపల్లి పూర్తి స్థాయి(ఎఫ్ఏసీ) ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

రొళ్ల: ఎంపీడీవోగా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్‌గా రెహమాన్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీగా నాగమని, రొళ్ల1 పంచాయతీ కార్యదర్శిగా బాబురావులు బాధ్యతలు చేపట్టారు.

పట్టణం- హిందూపురం | కాలనీలు - మోడల్ కాలనీ -1, 2 | కాలనీల ఏర్పాటు - 1985-86 | ఉన్న నివాసాలు - 1,800 | మొత్తం జనాభా - 6,500

ఆదర్శకాలనీల అభివృద్ధి అంతంత మాత్రమే

అధ్వానంగా రహదారులు, మురుగు కాలువలు



మోడల్ కాలనీకి వెళ్లే రహదారి దుస్థితి

హిందూపురం, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి, నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు ఎన్టీరామారావు ఆధ్వర్యంలో హిందూపురం పట్టణ సమీపంలో ఏర్పాటు చేసిన మోడల్‌కాలనీ 1, మోడల్‌కలనీ 2 ల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. కాలనీ ఏర్పాటు సమయంలో చేపట్టిన రహదారులు మురుగుకాలువలే తర్వాత దాదాపు 35 ఏళ్లు గడిచినా నేటికీ ఒక్క సీసీ రహదారి, మురుగుకాలువ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటుకు నోచుకోలేదు. నీటి సౌకర్యం అరకొరగా ఉండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల్లో ఒకటి, రెండు దఫాలు మాత్రమే నీరు అందుతుండటంతో ట్యాంకర్లతో కొనుగోలు చేస్తున్నారు.

పేరుకున్న చెత్తాచెదారం

కాలనీలోని ప్రధాన రహదారుల పక్కన చెత్తాచెదారం పేరుకుంటోంది. దీనిని మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేయకపోవటంతో అపరిశుభ్రత, దుర్వాసన వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు తరచూ శుభ్రం చేయకపోవటంతో చెత్త పేరుకొని మురుగు ముందుకు కదలడం లేదు. దీనివలన దోమలబెడద, దుర్వాసన భరించలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల చుట్టూ అపరిశుభ్రత, పందుల బెడద భరించలేక పోతున్నామని వారు పేర్కొన్నారు.

ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తాం

కాలనీలో దెబ్బతిన్న రహదారులను పరిశీలించి ప్రాధాన్య క్రమంలో మరమ్మతులు చేపడతాం. సీసీ రహదారులు లేని ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో ఏర్పాటు చేస్తాం. కాలనీలో పరిశుభ్రత చేపట్టి, సక్రమంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. **- సింగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, హిందూపురం**



కాలనీలో అపరిశుభ్రత

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో కాలువ మురుగుతో నిండింది. **-అబ్జల్‌ఉన్నీసా.**

సమస్య: ప్రశాంతి నగర్‌లో నాలుగు నెలలుగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నాం. **-మున్నా, పరిగి.**

సమాధానం: రెండు సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకొంటాం. **-శ్రీధర్, ఈవోఆర్డీ, పరిగి.** –న్యూస్‌టుడే, పరిగి

సమస్య: చౌళూరులోని ఎస్సీ కాలనీలో మురుగు శుభ్రం చేయలేదు. **-రవికుమార్, విద్యార్థి సంఘం నాయకుడు**

సమాధానం: రెండు రోజుల్లో పారిశుద్ధ్య చేయిస్తాం. **-నంజప్ప, సర్పంచి**

సమస్య: కొల్లకుంటలో తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రం. **-నరేష్**

సమాధానం: శుభ్రం చేయిస్తాం. **-మల్లికార్జునగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్** –న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య : రొద్దం వద్ద పెన్నానదిలో ఇసుక తరలిస్తున్నారు. **-మధు**

సమాధానం : అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకొంటాం **- నాగేంద్ర, తహసీల్దార్, రొద్దం**

సమస్య : గౌరాజుపల్లిలో తాగునీరు అందించాలి. **-రమేశ్**

సమాధానం : శుద్ధజల కేంద్రానికి మరమ్మతు చేయిస్తాం. **-చిన్నక్క, సర్పంచి, ఎంకొత్తపల్లి.** –న్యూస్‌టుడే, రొద్దం.

నడింపల్లి చెరువుకు తాత్కాలిక మరమ్మతులు



పరిశీలిస్తున్న ఏఈ రమేష్, తెదేపా నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: నడింపల్లి చెరువుకు గండి పడిన చోట గురువారం ఇన్‌ఛార్జి డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రమేష్ ఇసుక బస్తాలను వేయించారు. ఐదురోజుల నుంచి ఆయా ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శి అరుణ, వీఆర్వో నాగార్జున, తెదేపా నాయకులు వెంకటేశులు, రామాంజనేయులు, ఆంజనేయులు, పలువురు రైతులు ఇసుక బస్తాలు వేయించి నీరు లీకేజీ కాకుండా తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ఈదులబలాపురం గ్రామ చెరువుకట్ట గురువారం గండి పడింది. నీరు లీకేజీ అవుతున్న విషయాన్ని గ్రామ రైతులు గుర్తించి, వెంటనే జలవనరులశాఖ ఇన్‌ఛార్జి డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ రమేశ్ దృష్టికి తీసికెళ్లారు. ఈ సమాచారంతో చెరువు కట్ట వద్దకు చేరుకొని రైతులతో కలసి చిన్న గండి పడి నీరు లీకేజీ అవుతున్నట్లు వారు గుర్తించారు. శుక్రవారం ఇసుక బస్తాలు వేయించి, తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు చెరువు కట్టపై కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి..దారి లేకపోవడంతో పొక్లెయిన్‌తో చదును చేయించారు.

వైకాపా నుంచి తెదేపాలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, నాయకులు

మడకశిర, న్యూస్‌టుడే : పట్టణంలోని పలు వార్డులకు చెందిన వైకాపా నాయకులు, మహిళలు గురువారం తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి సమక్షంలో తెదేపాలో చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. మడకశిరలో సైతం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో మంచి అభివృద్ధి పనులు చేపడుతున్నారని, సమస్యలు వింటే వెంటనే స్పందిస్తున్నారని అన్నారు. పట్టణంలోని వైకాపా నాయకులు నాగేంద్ర, జగన్, రాము, నరేంద్రకుమార్, కార్తీక్, కిశోర్ తదితరులు పార్టీలో చేరారు. తెదేపా నాయకులు ఈశ్వరప్ప, రాజేష్, కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి ఆచూకీ తెలపాలని వినతి

హిందూపురం: పట్టణంలోని బోయపేటకు చెందిన పార్వతమ్మ తన కుమారుడు బాబుసాబ్(15) ఆచూకీ తెలపాలని పట్టణ రెండో పోలీసుస్టేషన్ పోలీసులను విన్నవించారు. పట్టణంలోని ఓ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడని ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గంగమ్మ రథోత్సవానికి వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదన్నారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 9440796845 నంబరుకు తెలియజేయాలని టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం సూచించారు.

రత్నాకర్‌ను కలిసిన తెదేపా జిల్లా అధ్యక్షుడు



పుట్టపర్తిలో రత్నాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, న్యూస్‌టుడే: సత్యసాయి ట్రస్ట్ ఛైర్మన్ రత్నాకర్‌ను పుట్టపర్తిలో గురువారం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా తెదేపా అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారిగా ట్రస్ట్ ఛైర్మన్‌ను కలిసినట్లు ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. సత్యసాయి ట్రస్ట్ అందిస్తున్న సేవలు పేదప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. హిందూపురం ప్రాంతానికి చెందిన పేదవిద్యార్థులకు చదువు విషయంలో సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. తెదేపా జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహానికి పూలమాలవేస్తున్న మంత్రి సవిత



హిందూపురంలో జ్యోతుల ఊరేగింపు



చిలమత్తూరులో తెదేపా నాయకులు

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

వాల్మీకి మహర్షి జయంతిని అన్ని నియోజకవర్గాల్లోనూ ఘనంగా నిర్వహించారు. పెనుకొండలోని తెదేపా కార్యాలయంలో మంత్రి సవిత వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పట్టణంలోని బోయపేటలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. హిందూపురంలో జ్యోతులతో ఊరేగింపుగా వాల్మీకి సంఘం, మహిళలు, తెదేపా నాయకులు వాల్మీకి ఆలయానికి చేరుకొని సమర్పించారు. చిలమత్తూరు, లేపాక్షి, మడకశిర, సోమందేపల్లి తదితర మండలాల్లో వాల్మీకి, తెదేపా నాయకులు ఘనంగా జయంతి నిర్వహించారు.

–న్యూస్‌టుడే బృందం



సోమందేపల్లి: విగ్రహానికి పూలమాలలు వేసి..



గోరంట్లలో..

భారీ వర్షంతో అగచాట్లు



మునిమడుగులో నేలవాలిన వరిపంట

పెనుకొండ, న్యూస్‌టుడే: పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. అక్కడక్కడ పాత ఇళ్లు కూలిపోయాయి. మగ్గాలు తడిసి నేతకార్మికులు తీవ్రంగా నష్టపోయారు. పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డు పక్కన ఆల్విన్‌కాలనీలోని పలువీధుల్లో వర్షం నీళ్లు రోడ్ల పై నిలిచిపోయవడంతో స్థానికులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. మునిమడుగు గ్రామంలో 1.9హెక్టార్ల విస్తీర్ణంలో వరి, శెట్టిపల్లి గ్రామంలో 2హెక్టార్ల విస్తీర్ణంలో వేరుశనగ పంట దెబ్బ తిన్నట్లు అధికారులు గుర్తించారు.

అగళి : అగళి మండలంలో ఐదు ఇళ్లు కూలిపోయాయి. దాసేగౌడనపల్లి గోవిందప్పకు ఇంటితోపాటు అగళిలో రంగమ్మ, పి.బ్యాడిగెర కరియప్ప, హనుమంతరాయప్పల ఇళ్లు, ఆర్‌జీ.పల్లి గ్రామానికి చెందిన గౌరమ్మ నివాసం కూలిపోయాయి. స్థానిక తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ గుర్రన్న, వీఆర్వోలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు.

రొద్దం : రొద్దంలో చేతిమగ్గం తడిసిపోవడంతో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు చేనేత కార్మికుడు రామాంజనేయులు వాపోయారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి తన ఇంట్లో ఉన్న మగ్గం, ఇతర వంట సామగ్రి తడిసిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.



దాసేగౌడనపల్లిలో కూలిన ఇల్లు

అమరాపురం : అమరాపురం తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల పైకప్పులు కారుతున్నాయి. కార్యాలయాల సిబ్బంది విధులు నిర్వహించడానికి ఇబ్బందిగా మారింది. స్థానిక వాటర్‌ట్యాంకులో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పైకప్పు కారుతుండడంతో విలువైన పుస్తకాలు తడచిపోతున్నాయి. హేమావతి కొత్త ఎస్సీ కాలనీలో సిద్ధప్ప ఇల్లు కూలిపోయింది.



అగళి తహసీల్దార్ కార్యాలయంలో తడిసిపోతున్న సర్వర్, ఇతర పరికరాలు

ఒకరికి తీవ్రగాయాలు

హిందూపురం: జూమాకులపల్లి వద్ద రాత్రి ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం చోదకుడు వసంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా పూలకుంటలో గురువారం రూ.50లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు హాజరై పనులు ప్రారంభించారు. ఎంపీడీవో సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా.. పిల్లర్లకే పరిమితం

మలుగూరులో ప్రభుత్వ భవనాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. వైకాపా పాలనలో రైతు భరోసా, పంచాయతీ కార్యాలయం, పశుసంవర్ధకశాఖ భవనాల నిర్మాణం పునాదులు వేసి పిల్లర్లు పోసి వదిలేశారు. చేసేదిలేక పాతభవనాల్లోనే ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరేంద్రకుమార్ మాట్లాడుతూ సంబంధితశాఖల అధికారులు చొరవతీసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. –న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం




రోడ్డంతా బురద.. వెళ్లేందుకు చింత



మడకశిర మండలంలోని మట్టి దారులు, తారు రోడ్లు గుంతలు ఏర్పడంతో వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి. జమ్మానిపల్లి గ్రామానికి వెళ్లే దారిలో అర కిలోమీటరు వరకు మట్టి రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచాయి. అదే విధంగా పెనుకొండ, అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిలో మురారాయనపల్లి వద్ద 300 మీటర్ల వరకు వర్షానికి రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వెంటనే ఆర్‌అండ్‌బీ ఎస్ఈతో మాట్లాడి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. –న్యూస్‌టుడే, మడకశిర

అల్లుకున్న అలసత్వం

హిందూపురం పట్టణంలోని కోటలో ఉన్న శివాలయం పక్కన రహదారిలో చెట్టుకొమ్మల తీగలు పెరుగుతూ విద్యుత్తు వైర్లను తాకుతున్నాయి. ఎప్పుడైనా ప్రమాదం జరగవచ్చని, వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్తుశాఖ ఈఈ భూపతిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్





గంధం మోసుకొస్తున్న కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో ఉరుసు

లేపాక్షి, న్యూస్‌టుడే: మండలంలోని నాగేపల్లి వద్ద ఉన్న పీర్ భక్తర్ వలీ దర్గాలో ఉరుసు ఉత్సవాలు రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాత్రి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మక్తియార్, శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో గంధోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. పెనుకొండ బాబయ్య స్వామి వంశస్తులు అబ్దుల్ రెహమాన్ సమక్షంలో భక్తిశ్రద్ధలతో గంధాన్ని కలుపకుని స్వామికి సమర్పించారు.

అడుగుకో గుంత.. చోదకుల అవస్థ



అధ్వానంగా రహదారి

పెనుకొండ, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో పెనుకొండ నుంచి అనంతపురం వెళ్లే పాత 7వ జాతీయ రహదారి నుంచి 44వ జాతీయ రహదారి కూడలి వరకు దాదాపు 6 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పూర్తికాకపోవడంతో గుంతల్లో వాహనాలు నడపలేక చోదకులు అవస్థలు పడుతున్నారు. పట్టణ శివారులోని తిమ్మాపురం కూడలి నుంచి తిమ్మాపురం సమీపంలోని తాటిచెట్ల వంక వరకు దాదాపు కిలోమీటరు మేర రోడ్డు 10 మీటర్ల విస్తరణ కోసం ఎన్నికలకు ముందు పనులు నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా విస్తరణ కోసం తవ్వి, కంకర నింపారు. తారు వేయాల్సిన సమయానికి ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కిలోమీటరు పొడువునా రోడ్డు గుంతలు పడటంతో వేల సంఖ్యలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో గుంతలు తప్పించేందుకు ద్విచక్రవాహనదారులు అపసవ్యదిశలో ప్రయాణిస్తూ ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పెనుకొండ రైల్వే గేటుతో కంపెనీ కార్మికులకు ఆలస్యమయ్యేదని, ప్రస్తుతం రైల్వే వంతెన పూర్తయినప్పటికీ ఈగుంతల రోడ్డుపై ప్రయాణం ఆలస్యమవడంతో పాటు, ప్రమాదకరంగా మారింది. మండలంలోని దాదాపు 15గ్రామాల ప్రజలు, పెనుకొండ నుంచి కియా, అనుబంధ పరిశ్రమల్లో విధులకు వెళ్లే వందలాది మంది కార్మికులు ఉదయం సాయంత్రం ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తవుతాయని ప్రయాణికులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు.



పూర్తికాని విస్తరణ పనులు

పరిశీలించి చర్యలు చేపడతాం

సకాలంలో నిధులు మంజూరవ్వక పనులు నిలిచిపోయాయి. రోడ్డును పరిశీలించి గుత్తేదారుతో మాట్లాడి పనులు పూర్తి చేయించే విధంగా చర్యలు చేపడతాం. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి రోడ్డు సమస్యను పరిష్కరిస్తాం. **-వెంకటరామిరెడ్డి, డీఈ, ర.భ.శాఖ, పెనుకొండ**

వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ: వివిధ పనులపై పట్టణానికి వచ్చి రాత్రులు ప్రయాణ సౌకర్యంలేని నిరాశ్రయుల కోసం ప్రభుత్వం సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సూచించారు. గురువారం పట్టణంలోని మడకశిర రోడ్డులో సమత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించారు. సమత అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి మంత్రిని శాలువ, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. నగరపంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సంస్థ సిబ్బంది, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల ఫిర్యాదులపై విచారణ

గోరంట్ల, న్యూస్‌టుడే: వానవోలు గ్రామానికి చెందిన పలువురు రైతుల పొలాలు బెంగళూరు - అమరావతి మధ్య నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే కోసం తీసుకున్నారు. ఇందుకు సంబంధించి చాలామంది రైతులకు పరిహారం విషయంలో సమస్యలు ఎదురవుతుండడంతో ఫిర్యాదులు ఇచ్చారు. దీంతో తహసీల్దార్ మారుతి ఆధ్వర్యంలో గురువారం వానవోలులో గ్రామసభ ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. తమ పరిధిలో పరిష్కారమయ్యే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వివరించారు. ఆర్ఐ సోమశేఖరరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు



శ్రీకృష్ణదేవరాయులు విగ్రహానికి పూలమాల వేసిన బలిజ సంఘం నాయకులు

రాయల సేవలు చిరస్మరణీయం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల సేవలు చిరస్మరణీయమని కదిరి బలిజ సంఘం నాయకులు అన్నారు. రాయల వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కదిరిలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చెరువులు నిర్మించి, తటాకాలు తవ్వి వ్యవసాయానికి సాగునీరు అందించిన మహాచక్రవర్తి రాయలువారని కొనియాడారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఖాద్రీ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

కదిరి, న్యూస్‌టుడే: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు గురువారం కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విన్నవించారు. దిల్లీలో మంత్రిని కలిశారు. దక్షిణ భారత దేశంలో విశిష్టత కలిగిన శ్రీఖాద్రీక్షేత్రం పర్యాటక అభివృద్ధితో ప్రపంచ గుర్తింపు పొందేలా సహకరించాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కందికుంట తెలిపారు.



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం'

కనగానపల్లి: అధైర్యపడకండి.. అండగా ఉంటానని ధర్మవరం నియోజకవర్గ తెదేపా బాధ్యుడు పరిటాల శ్రీరామ్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. గురువారం నెమిలివరంలో రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ మృతి చెందిన మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి అవకాశాలు

కదిరి, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకంతో 24 రంగాల్లో ఉపాధి అవకాశాలను పొందవచ్చని ప్రిన్సిపల్ స్మిత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఇంటర్న్‌షిప్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్ డీసీ సభ్యుడు హరికృష్ణ, కోఆర్డినేటర్ శంకర్‌లు మాట్లాడారు. కేంద్రం 2024 బడ్జెట్‌లో ఇంటర్న్‌షిప్ పథకం అమలుకు నిర్ణయం తీసుకుందన్నారు. యువతను ఉపాధి అవకాశాల దిశగా ప్రోత్సహించేలా నైపుణ్య శిక్షణకు సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా చొరవ చూపుతున్న సంస్థలకు, ఉపాధికై ఎదురుచూస్తున్న యువతకు మధ్య ప్రభుత్వం వారధిగా ఇంటర్న్‌షిప్ పథకం శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శివప్రసాద్, పీడీ నరసింహాచారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రమాదం చెంతన పసిపిల్లలు



1 కదిరి పట్టణంలోని హిందూపురం ప్రధాన రహదారిపై శిథిలమైన మున్సిపల్ ఉన్నత పాఠశాల భవనం ఉంది. పునాదుల రాళ్లు కదిలి, గోడలు నెర్రలు చీలి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇదే మార్గంలో నిత్యం పాదచారులు, వాహనదారులు సంచరిస్తుంటారు. భవనానికి వెనుక భాగంలో ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నారు. భవనం కూలితే ప్రాణనష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

2 కొత్తచెరువులోని పాత తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. వందేళ్ల నాటి నిర్మాణం కావడంతో నిర్వహణ కొరవడి పైభాగంలో రాగి వృక్షం పెరిగి గోడలు బీటలుబారాయి. శిథిల భవనం పక్కనే నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు వందకు పైగా పిల్లలు ఉంటారు.



శిథిల భవనాలు.. గాల్లో ప్రాణాలు

■ ఎడతెరపిలేని వర్షాలతో ప్రజల్లో భయాందోళన

కదిరి, కొత్తచెరువు, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: భారీ వర్షాలు కురుస్తుండటంతో వరదలు.. శిథిల భవనాలతో ప్రజల్లో భయం ఆవహిస్తోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాలం చెల్లించిన, శిథిల దశకు చేరుకున్న నిర్మాణాలను కూల్చే కార్యక్రమాన్ని విస్మరిస్తున్నారు. భారీ వర్షసూచన సమయంలోనే ప్రమాదకర భవనాలను గుర్తించడంతో సరిపెడుతున్నారు. ప్రస్తుతం పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో 134, కదిరి డివిజన్‌లో 550 బలహీన గృహాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని యజమానులే కూల్చుకోవడం, లేదంటే అధికారులు తొలగించడం చేయాలి. అలాంటిది ఎక్కడా చేయడం జరగడం లేదు. కనీసం ప్రమాదంగా గుర్తించిన నివాసాల నుంచి జనాన్ని ఖాళీ చేయించిన దాఖలాలు లేవు. నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో శిథిల భవనాలు తడిసి మరింత ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు నివారించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

క్షేత్రస్థాయిలో తగు చర్యలు

- గురుప్రసాద్, ఆర్డీఓ కార్యాలయ ఇన్‌ఛార్జి ఏవో

భారీ వర్షాల నేపథ్యంలో బలహీన నివాసాలు, ప్రభుత్వ భవనాల వివరాలు సేకరించాం. తగు చర్యలకు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో అధికారులకు ఆదేశాలిచ్చారు. డివిజనల్, మండలస్థాయి అధికారులు ప్రమాద పరిస్థితి ఉన్న చెరువులు, నిర్మాణాలను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటాం.



3 ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఉపరితల నీటిట్యాంకు శిథిలావస్థకు చేరుకుని విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉంది. ఐదేళ్ల కిందటే ఇది ప్రమాదకరంగా ఉండటంతో మున్సిపల్ అధికారులు వాడకుండా వదిలేశారు. దెబ్బతిన్న మెట్లను అధికారులు అరకొరగా కొట్టి వదిలేశారు. దీంతో ఏ క్షణాన్నైనా కూలేందుకు సిద్ధంగా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222



సమస్య: కదిరి ఫైర్‌స్టేషన్ వైపు నుంచి అడపాలవీధికి వెళ్లే మార్గంలో మురుగు కాలువపై నిర్మించిన కల్వర్టు దెబ్బతింది. వర్షపునీటి ప్రవాహం వల్ల రోడ్డుకూడా పాడవుతోంది. **- శరత్‌కుమార్**

సమాధానం: దెబ్బతిన్న కల్వర్టు, రోడ్డును పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచిస్తాం.

సమస్య: ఎస్టీ బాలికల వసతి గృహం సమీపంలో రోడ్డుపక్కన వేసిన చెత్త రెండ్రోజుల నుంచి తొలగించడం లేదు. వర్షం వల్ల చెత్తకుళ్లి దుర్వాసన వస్తోంది. **- మధు**

సమాధానం: వెంటనే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశిస్తాం.

(పైరెండు సమస్యలకు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ సమాధానం ఇచ్చారు.) – న్యూస్‌టుడే, అడపాలవీధి (కదిరి పట్టణం)

మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు ప్రణాళిక

ధర్మవరం పట్టణం : గతంలో తక్కువ అంచనా వేసిన ఆస్తులపై రీసర్వే చేసి కొత్తగా పన్నులు వేయాలని, వాటిని వెంటనే గుర్తించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, పరిపాలన శాఖాధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీకి ఆదాయం పెంచేలా అన్నిశాఖాల అధికారులు కృషి చేయాలన్నారు. ఆస్తి, నీటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని సూచించారు.



కొత్తచెరువు: వేడుకల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



పుట్టపర్తి గ్రామీణం: పెడపల్లిలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ మంగమ్మయ్య



కదిరి: వాల్మీకి చిత్రపటం ఊరేగింపు

విలువలు బోధించిన మహర్షి రచనలు

పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో వాల్మీకి జయంతి వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహాలు, చిత్రపటాలను అలంకరించి ఊరేగించారు. వక్తలు వాల్మీకి చరిత్రను వివరించారు. రామాయణం రాయడంతో సమాజానికి ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. మహర్షి రచనలు మానవాళికి విలువలను బోధించి దిశానిర్దేశం చేశాయన్నారు. సాయిఆరామంలో జిల్లా తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకల్లో జేసీ అభిషేక్‌కుమార్ జ్యోతి వెలిగించి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రత్న వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు. **- న్యూస్‌టుడే బృందం**



ధర్మవరం: మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



రామగిరిలో..



చెన్నేకొత్తపల్లిలో కేకు కోస్తున్న యువజన సంఘ సభ్యులు

గ్రామాభివృద్ధికే పల్లె పండగ

నల్లమాడ, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కోసమే ప్రభుత్వం 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం నల్లమాడ మండలంలో దాదాపు రూ.3 కోట్ల పనులను నల్లమాడ పంచాయతీలో రూ.232 లక్షలు, దొన్నికోట పంచాయతీలో రూ.40 లక్షలు, పులగంపల్లి పంచాయతీలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటుకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

21న డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ స్మిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా ఉంటుందన్నారు. ఇందుకు రెండు కంపెనీలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు అర్హులని, ఎంపికైనవారు బెంగళూరు, మంగళూరులలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. హాజరయ్యే అభ్యర్థులు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు వెంటతీసుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ప్రిన్సిపల్ స్మిత, ఏపీఎస్ఎస్‌డీసీ హరికృష్ణ కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ సంజీవప్ప రంగప్ప, రీజనల్ మేనేజర్ రమేష్ తెలిపారు. గురువారం ముదిగుబ్బలోని కదిరి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఖాతాదారులకు వ్యవసాయ, గృహ, ద్విచక్ర, వ్యాపార రుణాలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ మేనేజర్ సాగర్, కెనరా బ్యాంకు మేనేజర్ లక్ష్మీనరసింహ, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న ఏపీజీబీ జీఎం సంజీవప్ప, రంగప్ప, ఆర్ఎం రమేష్

19న చేనేత ఆత్మీయ సమావేశం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని గాంధీనగర్ మారుతి రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో ఈనెల 19న చేనేత ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పట్టుచీరల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు గిర్రాజు రవి, జాతీయ చేనేత నాయకురాలు జయశ్రీ, వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. చేనేత ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, చేనేతజౌళిశాఖ మంత్రి సవిత, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతున్నట్లు చెప్పారు. ధర్మవరంలో చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళతామన్నారు. పోలా ప్రభాకర్, గిర్రాజు శశి, గుండా పుల్లయ్య, గుద్దిటి రాము, గద్దం పార్థసారథి, నీలూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతుల పొలాలకు దారి చూపాలని వినతి

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు సరైన దారులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ఇన్‌ఛార్జి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడికి బెదిరింపు

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం నియోజకవర్గ తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేష్ చౌదరిని గురువారం గొట్లూరు గ్రామానికి చెందిన తలారి చిరంజీవి, పోతలయ్య ఫోన్ చేసి బెదిరించి అనంతరం తన వాహనాన్ని అడ్డగించి దుర్భాషలాడారని ధర్మవరం గ్రామీణ పోలీసుస్టేషన్‌లో మహేష్ చౌదరి ఫిర్యాదు చేశారు. అనంతపురం నుంచి ధర్మవరానికి కారులో వస్తున్న తనను గొట్లూరుకు చెందిన తలారి చిరంజీవి ఫోన్‌లో బెదిరించాడని, గొట్లూరు గ్రామ ఆర్చ్ వద్దకు చేరుకోగానే వాహనాన్ని అడ్డగించి దుర్భాషలాడాడని పేర్కొన్నారు. ధర్మవరం గ్రామీణ సీఐ ప్రభాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

లోక్‌అదాలత్ సద్వినియోగం చేసుకోండి

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: ఆవేశంతో నేరాలు చేసి సబ్‌జైలుకు వచ్చిన ఖైదీలు లోక్‌అదాలత్ ద్వారా అందే సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్ సూచించారు. కదిరి సబ్‌జైలులోని ఖైదీలకు నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సులో న్యాయమూర్తి పాల్గొని లోక్‌అదాలత్ ద్వారా అందేసేవలను వివరించారు. సబ్‌జైలులో ఖైదీలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గదులు, వంటశాలలను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డికి సూచించారు. న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, నరసింహులు, దశరథనాయక్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తలుపుల మండలం గొల్లపల్లితండా వద్ద ఆర్డీటీ సంస్థ నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ కోసం ప్రజల భాగస్వామ్యంగా రూ.3.65 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఆప్రాంత రైతుల నుంచి రూ.2.65 లక్షలు ఇవ్వగా మిగతా లక్షరూపాయలను శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ విరాళంగా ఇచ్చినట్లు గొల్లపల్లి తండావాసి గంగాధర్‌నాయక్ తెలిపారు. దీంతోపాటు రైతుల భాగస్వామ్యాన్ని కలిపి ఆర్డీటీ ప్రతినిధి బీరలింగప్పకు తండావసులు అందజేశారు.

మద్యం దుకాణదారులను బెదిరిస్తే చర్యలు

నల్లమాడ : ఇటీవల మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులపై ఎవరైనా బెదిరింపులకు దిగితే నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని డీఎస్పీ విజయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం నల్లమాడ సర్కిల్ కార్యాలయాన్ని డీఎస్పీ తనిఖీ చేశారు. సీఐ నరేంద్రారెడ్డి, ఎస్ఐ దాదాఖలందర్‌లతో సమావేశం నిర్వహించారు. నల్లమాడ పోలీసుస్టేషన్ పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మరిందని ఎస్ఐ తెలిపారు.

స్తంభించిన రాకపోకలు



ఇరగంపల్లి వద్ద వంగపేరు ప్రవాహం



ధర్మవరం రహదారిలో వంతెన దగ్గర పోలీసు బందోబస్తు

కొత్తచెరువు: పెనుకొండ, పుట్టపర్తి మండలాల పరిధిలోని ఎగువ ప్రాంతాల నుంచి వరద దిగువకు చేరుతోంది. దీంతో ఎర్రపల్లి, ఇరగంపల్లి, కొడపగానిపల్లి గ్రామాల పరిధిలోని వంగపేరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గురువారం తెల్లవారుజామున ధర్మవరం రహదారిలోని వంతెనపై వంగపేరు ప్రవాహంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈనేపథ్యంలో సత్యసాయి పంపుహౌస్ వంతెన దగ్గర పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. తహసీల్దార్ నీలకంఠారెడ్డి, సీఐ ఇందిరు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ తగు చర్యలు చేపట్టారు.



మరువ పారుతున్న న్యామద్దెల చెరువు



వెల్దుర్తి సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

తెరపివ్వని వర్షం

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వెల్దుర్తి గ్రామ సమీపంలో చిత్రావతి నది బుధవారం రాత్రి నుంచి ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఆయా గ్రామాల ప్రజలు బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల మీదుగా రాకపోకలు సాగించారు. చిత్రావతి నది ప్రవాహాన్ని ఆర్డీఓ మహేశ్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ మురళి, డీఈ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ సురేష్ పరిశీలించారు. తెదేపా మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి అక్కడికి చేరుకొని భారీ వర్షాలు వచ్చిన ప్రతిసారి ఆరు గ్రామాల ప్రజలు నెలల తరబడి ఇబ్బంది పడుతున్నారని, సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు విన్నవించారు. వర్షానికి న్యామద్దెల, ముష్టికోవెల చెరువులు మరువ పారాయి. ఆయా గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి.



దెబ్బతిన్న టమాటా పంట

మొలకలు మొదలై.. రైతు గుండె బరువై

తనకల్లు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమంచి తీరా పంట చేతికి అందివచ్చిన సమయంలో కళ్లముందే మొలకలు వచ్చి పంట కుళ్లుతుండటంతో ఆ రైతుల వేదన వర్ణనాతీతం. మండలంలోని మల్లిరెడ్డిపల్లి పంచాయతీ పెద్దపల్లిలో జి.శ్రీనివాసులు అనే రైతు కౌలుకు ఎకరా భూమిలో వేరుసెనగ పంట సాగుచేశారు. అదే గ్రామానికి చెందిన మరో రైతు డి.వెంకటరవణ కౌలుకు ఎకరా విస్తీర్ణంలో రూ.25 వేలకు పైగా ఖర్చు చేసి పంట తీశారు. పంట కాలం పూర్తవడంతో పీకి వాదులు వేసిన తరువాత వాయుగుండం కారణంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మొలకలు వచ్చాయి. ప్రభుత్వం సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



తనకల్లు: రంగుమారిన పంట వద్ద రైతు శ్రీనివాసులురెడ్డి

మగ్గం గుంతల్లోకి ఊటనీరు

ధర్మవరం పట్టణంలోని సంజయ్‌నగర్‌లో మగ్గం గుంతల్లో నీరు చేరింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షం నీరు భూమిలో ఇంకి మగ్గం గుంతల్లో ఊరుతున్నాయి. కార్మికులు మగ్గాలను చుట్టిపెడుతున్నారు. సంజయ్‌నగర్, శివానగర్, జోగోనుకుంట కాలనీల్లో ఇబ్బందులు పడుతున్నారు.

అర్ధరాత్రి కూలిన మిద్దె..



ముదిగుబ్బ: మండలంలోని ఎస్.బ్రాహ్మణపల్లికి చెందిన వీరనారప్ప పాత మిద్దె వర్షానికి గురువారం రాత్రి 2 గంటల సమయంలో కూలింది. అప్పటికే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు మరొక ఇంటిలో ఉండటంతో ప్రమాదం తప్పింది.

వర్షంతో నష్టం జరగనీయొద్దు

తనకల్లు, న్యూస్‌టుడే: వర్షాలతో నష్టం జరగకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని కదిరి ఆర్డీఓ వెంకట సన్యాసిశర్మ అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శోభసువర్ణమ్మ, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయి అక్కడ ఎలాంటి తీవ్రతను గుర్తించారు అనే విషయాలు సిబ్బందితో తెలుసుకున్నారు. డీటీ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, వీఆర్ఓలు, సిబ్బంది ఉన్నారు.

పాక్షికంగా దెబ్బతిన్న నివాసాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలధాటికి కదిరి పట్టణం, గ్రామీణ మండలంలో మూడునివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పట్టణంలోని అమీన్‌నగర్‌లో ఇద్దరి మధ్య వివాదంలో ఉన్న నివాసంపై చెట్టు విరిగిపడటంతో పాక్షికంగా దెబ్బతినింది. కదిరి మండలం ఎగువపల్లికి చెందిన మల్లీశ్వరి, కదిరికుంట్లపల్లిలో రమాదేవికి చెందిన పాతమిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెవెన్యూ సిబ్బంది దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, యజమానుల నుంచి వివరాలు సేకరించారు.

వాగులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కాలువలు, వాగులు, చెరువులు ఆక్రమించేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని కదిరి ఆర్డీఓ వెంకటసన్యాసిశర్మ హెచ్చరించారు. గురువారం కదిరిపట్టణ పరిధిలోని వాగులను, కాలువలను ఆయన పరిశీలించారు. వాగులు ఆక్రమణ వల్ల భారీవర్షాలు కురిసిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆర్డీఓ అన్నారు. మదనపల్లెరోడ్డులోని పుట్టమానుచెరువు వాగు కల్వర్టును పూడ్చి వేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్డీఓ వెంట నీటిపారుదలశాఖ ఈఈ గంగాధర్, డీఈ గంగాద్రి, కదిరి తహసీల్దార్ మురళీకృష్ణ, ఏఈ మహేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో జలమయ్యే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి సమత ఆదేశించారు. కొత్తచెరువు మేజరు పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ, బిసి కాలనీల్లో గుర్తించిన ముంపు ప్రాంతాలను డీపీవో గురువారం పరిశీలించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో నటరాజ్, మేజరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డిలతో కాలనీల పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

హోటల్‌లో విద్యుదాఘాతం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం పోలీస్‌లైన్‌లోని గ్రీన్‌బావర్చి హోటల్‌లో బుధవారం అర్ధరాత్రి తరువాత సంభవించిన విద్యుదాఘాతంతో ఏసీ, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. హోటల్ యజమాని శరత్‌కుమార్‌రెడ్డి రాత్రిపొద్దుపోయాక హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుసుకుని వచ్చిచూడగా లోపలికి వెళ్లేందుకు వీలుకాలేదు. పొగలు కమ్ముకోవడంతో అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. హోటల్‌లో వినియోగించే వస్తువులు, ఫర్నీచర్, ఏసీ పూర్తిగా కాలిపోయాయి. రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారి మన్సూర్‌అలీకి వినతిపత్రం సమర్పించినట్లు హోటల్ యజమాని తెలిపారు.

టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కదిరి పట్టణం జీవిమాను కూడలిలో కేజీఎన్ వాహన టైర్లు, విడిభాగాల దుకాణంలో గురువారం రాత్రి సమయంలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగి ఆస్తి నష్టం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు.. మూసి ఉన్న టైర్ల దుకాణం నుంచి పొగలు వస్తున్నాయని పక్క దుకాణదారులు విడిభాగాల దుకాణం యజమాని సుహైల్‌కు తెలిపారు. అక్కడికి చేరుకున్న యజమాని దుకాణం తెరవగా అప్పటికే మంటలు దుకాణం మొత్తం వ్యాపించి ఉన్నాయి. దీంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దుకాణంలో ఉన్న సైకిల్, ద్విచక్ర వాహనాల టైర్లు, విడిభాగాలు, పంక్చర్ మిషన్ పూర్తిగా కాలిపోయి పనికిరాకుండాపోయాయి. సుమారు రూ.2 లక్షలు నష్టం అంచనా వేశామని, పూర్తి ఆస్తి నష్టం అంచనాను రేపు పరిశీలించి తెలియజేస్తామని అగ్ని మాపకశాఖ అధికారి మన్సూర్ అలి తెలిపారు. **కదిరి గ్రామీణం:** కదిరి మండలం పట్నం పంచాయతీ ఏటిగడ్డతండా గ్రామంలో బుధవారం రాత్రి మునేనాయక్ అనేవ్యక్తి ఇంట్లో విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగి సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఇంట్లో ఫ్రిజ్, టీవీ, దుస్తులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.



దుకాణంలో ఎగిసి పడుతున్న మంటలు